క్లుప్తంగా

కారుణ్య నియామకం



వరంగల్: పంచాయతీరాజ్ శాఖలో బొల్లికుంటలో క్రాఫ్ట్ టీచర్‌గా పనిచేస్తున్న దేవులపల్లి భాస్కర్ 2022వ సంవత్సరంలో చనిపోయారు. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదని జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతికి మృతుడి కుమారుడు అన్వేష్ విన్నవించాడు. దాంతో ఆమె స్పందించి సీఈఓ సంపత్‌రావుతో చర్చించి వెంటనే కారుణ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు క్యాంపు కార్యాలయంలో అన్వేష్‌కు గండ్ర జ్యోతి బుధవారం ఉత్తర్వులు అందజేశారు. అదేవిధంగా, ముగ్గురు ఆఫీసు సబార్డినేట్లకు రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు.

ఏక్ శ్రేష్ట్.. ఏక్‌భారత్‌కు ఎల్బీ కళాశాల విద్యార్థులు



రామన్నపేట: ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరగనున్న ఏక్ శ్రేష్ట్ ఏక్‌భారత్ కార్యక్రమానికి వరంగల్ ములుగు రోడ్డులోని ఎల్బీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సాంస్కృతిక అంశాలను విద్యార్థులు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఈమేరకు ఎంపికైన జయంత్‌కుమార్, రామ్‌కుమార్, వేణుమాధవ్, అక్షయ్, శ్రీరాం, నవ్య, సృజన, పూజితను అభినందించారు.

పిల్లలకు ఆటపాటలతో విద్య

ఖిలా వరంగల్: అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సృజన సూచించారు. వరంగల్ పెరకవాడలోని అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ డే దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ప్రభుత్వం అందించే పోషకాలను అందించాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భవాని, సుజాత, ఏఎన్‌ఎం నాగలక్ష్మి, ప్రమీద, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూల్చివేతతో ఉద్రిక్తత



వరంగల్ అర్బన్: వరంగల్ హంటర్ రోడ్డు 28వ డివిజన్‌లోని సంతోషిమాత దేవాలయం వెనుక వైపు ఉన్న ప్రహరీ కూల్చివేత బుధవారం ఉద్రిక్తతకు దారితీసింది. బల్దియా ఎన్‌ఫోర్స్‌మెంట్, డీఆర్‌ఎఫ్ సిబ్బంది జేసీబీతో ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నిర్మాణాన్ని కూల్చివేసేందుకు రాగా, స్థల యాజమాని అడ్డుకున్నారు. ఎఫ్‌టీఎల్‌లో ఉంటే పదేళ్ల క్రితం ఇంటి నంబరు ఎలా ఇచ్చారని బాధితుడు పెండ్యా పవన్ ప్రశ్నించారు. ఆస్తి పన్ను కూడా చెల్లిస్తున్నానని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ జేసీబీతో ప్రహరీ, రేకుల షెడ్డును సిబ్బంది నేలమట్టం చేశారు. ఈక్రమంలో దాదాపు రూ.15 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

'సిటీ కళాశాల'లో జాబ్‌మేళా

హన్మకొండ: హనుమకొండ కిషన్‌పురలోని సిటీ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 357 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 157 మంది వివిధ కంపెనీలు, సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విప్రో, జెన్‌ప్యాక్ట్, ముత్తూట్, హెచ్‌డీఎఫ్‌సీ, రాండ్‌స్టాండ్, కుటుంబ్ కేర్, ఆర్కిడ్స్ ఇంటర్‌నేషనల్ స్కూల్, హెటిరో డ్రగ్స్‌తో పాటు ఆయా కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్‌లు, కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వంగ రాజేందర్, ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, అధ్యాపకులు నరేష్, యుగేందర్, స్వామి, కుమారస్వామి, శ్రీనివాస్, రాజు, చైతన్య, సరళ, సుమతి, రాధిక, మానస పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

హసన్‌పర్తి: బీఆర్‌ఎస్ సర్కార్‌లో రైతే రాజు అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి మండలం మడిపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేణుకుంట్ల సునీత, స్థానిక సర్పంచ్ చిర్ర సుమలత, వైస్ ఎంపీపీ రత్నాకర్ రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ, పీఏసీఎస్ చైర్మన్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ముచ్చర్లకు చెందిన కె.మల్లయ్యకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును నాయకులు అందించారు. లబ్ధిదారుడికి ఇంటికి బుధవారం వెళ్లి చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, పోలు, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగం చేసిన అకాల వర్షం

- తడిసి ముద్దయిన ధాన్యం
- వేలాది ఎకరాల్లో పంటల నష్టం
- రాలిన మామిడి కాయలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

హసన్‌పర్తి: మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులు ఆగమయ్యారు. హసన్‌పర్తి మండలంలో వేలాది ఎకరాల పంట దెబ్బతిన్నది. ఓవైపు వర్షం.. మరో వైపు రాళ్ల పడడంతో వరి పంట నేలకొరిగింది. మొక్క జొన్న పంట చేతికి రాకుండా పోయింది. కూరగాయల పంటలు ధ్వంసమయ్యాయి. రాళ్ల వానకు మామిడి రైతులకు కోలుకోలేని దెబ్బతగిలింది. పంటలను ఏఓ అనురాధ పరిశీలించారు.

అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు

మడికొండ: అకాల వర్షాలకు కాజీపేట మండలం మడికొండ, రాంపూర్ గ్రామాల్లో వరి పంట మొత్తం నేలవాలి వరిధాన్యం రాలిపోయింది. అలాగే, మామిడి కాయలు నేలరాలాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందే సమయంలో అకాల వర్షంతో పూర్తిగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాజీపేట మండలంలో ఇంతవరకు ఐకేపీ సెంటర్లను ప్రారంభించకపోవడంతో ధాన్యం రాశులు వరద పాలయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఐకేపీ సెంటర్లను త్వరగా ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

శాకరాశికుంట బురదమయం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాంతో వరంగల్ 39వ డివిజన్ శాకరాశికుంటలోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగడంతో కాలనీ రోడ్లపై మురుగునీరు భారీగా నిలిచింది. పలువురు ఇళ్లల్లోకి మురుగుతోపాటు వరద నీరు చేరింది. ఈక్రమంలో నిత్యావసర సరుకులు, బియ్యం తడిసి ముద్దయ్యాయి. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య సిబ్బంది తొలగించడంతో వరదనీరు తగ్గుముఖం పట్టింది. లోతట్టుకాలనీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జలమయమైన రైల్వే జంక్షన్

కాజీపేట రూరల్: మంగళవారం కురిసిన వర్షానికి కాజీపేట రైల్వే జంక్షన్‌లోని ఆటో స్టాండ్ జలమయమైంది. బస్టాండ్ రోడ్డులో గుంతలలో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.



హసన్‌పర్తి: వర్షానికి తడిసిన ధాన్యం



ఖిలా వరంగల్: శాకరాశికుంటలో నిలిచిన నీరు



కాజీపేట రూరల్: ఆటో స్టాండ్‌లోకి చేరిన వరద



మడికొండ శివారులో వాలిపోయిన వరి

దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

హన్మకొండ: అకాల వర్షాలు, వడగళ్లకు హసన్‌పర్తి మండలం పెగడపల్లిలో దెబ్బతిన్న పంట పొలాలను బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, జిల్లా ఇన్‌చార్జ్ వి.మురళీధర్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, పార్టీ నాయకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు పరిహారం అందేవరకు పోరాడుతామని హెచ్చరించారు. హనుమకొండ జిల్లాలో విరివిగా పండించే వరి ధాన్యం, మొక్కజొన్న, ఆకు కూరలు, కూరగాయలు పూర్తిగా దెబ్బతిన్నాయని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

హన్మకొండ: అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి కోరారు. పంట నష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే చేసి బాధిత రైతులను ఆదుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఫసల్ బీమా యోజన పథకం రాష్ట్రంలో అమలయితే రైతులకు ఈ దుస్థితి వచ్చేది కాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల రైతులకు బీమా అందడం లేదని తెలిపారు. ఒకవైపు అకాల వర్షం కారణంగా రైతులు కన్నీళ్లు పెట్టుకుంటే, మరోవైపు బీఆర్‌ఎస్ నాయకులు ఆత్మీయ సమ్మేళనాలు, ప్లీనరీల పేరిట చిందులేస్తున్నారని పేర్కొన్నారు. ఆగమైన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు.



పెగడపల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రావు పద్మ, కొండేటి శ్రీధర్, నాయకులు

ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం



ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో చీఫ్ విప్

కాజీపేట: 58, 59 జీఓ ప్రకారం ఇంటి నివేశన స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన సదావకాశాన్ని పశ్చిమ నియోజక వర్గంలోని అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సూచించారు. 63వ డివిజన్ ఏఆర్‌ఆర్‌నగర్ కాలనీలో జిల్లా, మండల రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన బుధవారం పాదయాత్ర చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలతో ముఖముఖి సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ నివేశన స్థలాలను క్రమబద్ధీకరించి పట్టాలు పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విద్యానగర్ హిందూ శ్మశాన వాటిక, సోమిడి కుంట, మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేసిన డబుల్ బెడ్రూం ఇళ్ల స్థల వివాదాన్ని జర్నలిస్టుల సహకారంతో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ కిరణ్‌కుమార్, కార్పొరేటర్ సంకు నర్సింగ్, ఎండీ.సోని, బి.వినయ్ కుమార్, నార్లగిరి రమేష్, మర్యాల కృష్ణ, బి.రంజిత్ కుమార్, సుంచు అశోక్, ఎస్.శ్రీధర్, మహమూద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వాలి

విద్యారణ్యపురి: పాలిటెక్నిక్ విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎస్‌వీఎస్ కళాశాల ఎదుట జాతీయ రహదారిపై కొంతమంది విద్యార్థులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ ఎస్‌వీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో కొంతమంది విద్యార్థులకు హాజరుశాతం తక్కువగా ఉందనే నెపంతో హాల్‌టికెట్లు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 25నుంచి పరీక్షలు ప్రారంభం కావడంతో, హాల్‌టికెట్లు అందని విద్యార్థులు మొదటి రోజు పరీక్షను కోల్పోయారని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు, వినయ్, తరుణ్, రాజ్‌కుమార్, సందీప్, అవినాష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

వెజ్, ఫ్రూట్ మార్కెట్లలో లోపించిన పారిశుద్ధ్యం



లక్ష్మీపురం మోడల్ మార్కెట్ వద్ద బురద

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధి లక్ష్మీపురంలోని పండ్ల మార్కెట్, కూరగాయల మార్కెట్‌లో పారిశుద్ధ్యం పడకేసింది. మోడల్ కూరగాయల మార్కెట్ ముందు ఉన్న రహదారులపై సక్రమంగా పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మట్టి కాస్త బురదగా మారింది. పండ్ల మార్కెట్ స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంలో ఉండడంతో పాత కూరగాయల మార్కెట్‌ను తాత్కాలికంగా పండ్ల మార్కెట్ వ్యాపారులకు కేటాయించారు. వారికి కేటాయించిన గదుల్లో వ్యాపారం చేయకుండా రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. మామిడి సీజన్ ప్రారంభం కావడంతో అందులో చెడిపోయిన పండ్లను ఎక్కడ పడితే అక్కడే పడివేయడంతో దుర్వాసన వస్తోంది.

'దివ్యాంగులకు ఫీజు మినహాయింపు ఇవ్వాలి'



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఇయర్ వైజ్ డిగ్రీ కోర్సుల్లో బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు పూర్తి చేసుకునేందుకు వర్సిటీ అధికారులు అవకాశం ఇచ్చారు. అయితే, ఒక్కో సబ్జెక్టుకు ప్రాసెసింగ్ ఫీజు రూ.3వేలు, పరీక్ష ఫీజు రూ.4వేలుగా నిర్ణయించారు. ఈ ఫీజు దివ్యాంగ విద్యార్థులకు భారంగా ఉందని ఆ ఫీజు నుంచి మినహాయింపు ఇవ్వాలని బీఎస్‌ఎఫ్, టీఎస్‌డీఎస్‌ఏ విద్యార్థి సంఘాల బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ సామాజిక ప్రజాస్వామిక విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ క్రాంతికిరణ్, కేయూ బీఎస్‌ఎఫ్ అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు తుమ్మల రాకేష్, రాజు, బాధ్యులు వంశీ, వినయ్ పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో ప్రతిభతోనే ఉద్యోగం

కేయూ క్యాంపస్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకే ఉద్యోగ అవకాశాలు వస్తాయని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య అన్నారు. కళాశాలలో మేనేజ్‌మెంట్ విభాగంలో మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ కంపెనీ ఆధ్వర్యంలో ఎంకామ్ విద్యార్థులకు బుధవారం నిర్వహించిన ఉద్యోగమేళ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతోందని, అందుకనుగుణంగా తమ నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రైవేట్ రంగంలో పలు కంపెనీలు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగం అధిపతి డాక్టర్ కనకయ్య, ప్లేస్‌మెంట్ మేనేజర్ రాఘవకుమార్, విక్రమ్, ప్రణయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అయిలయ్య

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని కార్యకర్తలకు బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ సూచించారు. హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో పరకాల నియోజకవర్గ స్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి మద్దతు కూడగట్టాలని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీని పోలింగ్ బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ వి.మురళీధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్.పి.జయంత్ లాల్, కొండి జితేందర్ రెడ్డి, కొత్తగూడెం నియోజకవర్గ ప్రభారి దేవనూరి మేఘనాథ్, నాయకులు రాజ భద్రయ్య, రతన్, మండల అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రావు పద్మ

సంక్షిప్తంగా

నేడు భగీరథ మహర్షి జయంతి

కాజీపేట అర్బన్: భగీరథ మహర్షి జయంతి వేడుకలను హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ఎస్1 సమావేశ మందిరంలో గురువారం నిర్వహించనున్నట్లు బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు వేడుకల్లో పాల్గొనాలని పేర్కొన్నారు.

అన్ని కులాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఖిలా వరంగల్: భద్రకాళి బ్రహ్మోత్సవాలకు కొన్ని కులాలకే ఆహ్వాన పత్రికలు ఇవ్వటం సరికాదని, అన్ని కులాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సామాజిక న్యాయవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద కుమార్ సూచించారు. వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రకాళి అమ్మవారు కొందరికే కాదు అందరికి దేవత అని అన్నారు. భద్రకాళి బ్రహ్మోత్సవాల్లో పూజారుల జోక్యాన్ని పూర్తిగా తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, మహేష్, శిరీష్, రజిత, శాలిని పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చి ఓట్లు అడగాలి

కాజీపేట: రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ నాయకులు పని చేసి ఓట్లు అడగాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు సూచించారు. ఇంటింటికి సీపీఐ అనే కార్యక్రమంలో భాగంగా కాజీపేట పట్టణంలోని పలు కాలనీల్లో కార్యకర్తలతో కలిసి బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను వెంటనే కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మేనగాల భిక్షపతి, మాలోతు శంకర్, బొట్టు భిక్షపతి, పూర్ణచందర్, దీన, జ్యోతి, స్వరూప పాల్గొన్నారు.

కళాభవన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కరీమాబాద్: డివిజన్ పరిధిలో సాంస్కృతిక రంగానికి ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో నిర్మిస్తున్న కళాభవన్‌ను కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. కార్పొరేషన్ జనరల్ ఫండ్ రూ.9 లక్షల వ్యయంతో కళాభవన్‌ను అన్ని రకాల హంగులతో నిర్మించనున్నట్లు తెలిపారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

నయీంనగర్: రాష్ట్రంలో 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని దళిత్ శక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి పూరెల్ల రమేష్ పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న హైదరాబాద్‌లో జరగనున్న ముగింపు సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు తరలిరావాలని కోరారు.

బీఆర్‌ఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడిగా రఘువీర్

హన్మకొండ చౌరస్తా: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆదేశాలతో పార్టీ 4వ డివిజన్ ఉపాధ్యక్షుడిగా పెద్దమ్మగడ్డకు చెందిన వీర రఘువీర్‌ను నియమించినట్లు పార్టీ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ కంజర్ల మనోజ్‌కుమార్ తెలిపారు.

గంజాయి పట్టివేత

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోచమ్మకుంట శ్మశాన వాటికలో ఒక వ్యక్తి నుంచి రూ.12 వేల విలువ గల 300 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. పోచమ్మకుంటకు చెందిన దుబ్యాల చరణ్ గంజాయి అమ్ముతున్నాడనే సమాచారంతో దాడి చేసినట్లు వివరించారు. టాస్క్‌లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రావు, జనార్దన్‌రెడ్డి, ఎస్సైలు నిస్సార్‌పాషా, లవన్‌కుమార్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత

రామన్నపేట: పోగొట్టుకున్న 10సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు పోలీస్ స్టేషన్‌లో బుధవారం అప్పగించినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఫోన్లను ట్రాక్ చేసి బాధితులకు అందించడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ శివ సీఐ అభినందించారు.

వడ్డీ వ్యాపారిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: తీసుకున్న అప్పుకు వడ్డీ, అసలు తిరిగి వెంటనే చెల్లించాలని హెచ్చరిస్తూ ఇంటికి తాళం వేసి వేధింపులకు గురిచేస్తున్న వడ్డీ వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.


పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



చిన్నారులతో సీడీపీఓ విశ్వజ, తదితరులు

కరీమాబాద్: చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల ప్రతీఒక్కరు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ వరంగల్ ప్రాజెక్టు సీడీపీఓ విశ్వజ అన్నారు. ఉర్సు సెక్టార్ పరిధిలోని 33, 41వ డివిజన్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ డే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వజ మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు ఆటపాటలతో అంగన్‌వాడీ టీచర్లు విద్య నేర్పించడం వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి, టీచర్లు జయ, మమత, యశోద, జ్యోతి, రాణి, సుకన్య, సుజాత, నజీమా, హైమావతి, వినీత, శాంతతోపాటు ఆయాలు, ఆశ వర్కర్లు, పిల్లలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల రక్షణకు షీ టీమ్స్



వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు, సిబ్బంది

హన్మకొండ / వరంగల్ క్రైం : మహిళలు, బాలికల రక్షణకు షీటీమ్స్ పని చేస్తున్నాయని షీటీమ్ ఇన్‌స్పెక్టర్ వై.సంజీవరావు అన్నారు. హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో అమ్మాయిలు జాగ్రత్త వహించాలని చెప్పారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరానికి గురైనట్లు గ్రహిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. ఇబ్బందులు ఎదురైనప్పుడు 87126 85257, 87126 85142, 87126 85270 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ సమాచార వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, షీ టీమ్ ఎస్సై విద్యాసాగర్, హెడ్ కానిస్టేబుల్ బిచ్య నాయక్, కానిస్టేబుల్ వంశీకృష్ణ, సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్ కరస్పాండెంట్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

కోటను సందర్శించిన ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి

ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోటను బుధవారం సాయంత్రం ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కౌశిక్ రెడ్డి తన కుమార్తెతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కీర్తి తోరణాల నడమ నల్ల రాతిలో నాటి శిల్పులు చెక్కిన అద్భుతమైన శిల్ప కళా సంపదను వారు తిలకించారు. అనంతరం రాతి, మట్టికోట అందాలు, కుష్‌మహల్‌ను సందర్శించి కాకతీయుల కళాఖండాలను వీక్షించారు. ఆయన వెంట రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, ఆర్ఐ రాంబాబు, కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి మడిపెల్లి మల్లేశం, టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్, కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణ, పురావస్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

వరంగల్: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. కాశిబుగ్గ తిలక్‌రోడ్డులోని కేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన స్టాండర్డ్ ఉన్నత పాఠశాల 37వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డేలో ఆయన మాట్లాడారు. వేలమందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత స్టాండర్డ్ పాఠశాలదని ప్రశంసించారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా విన్యాసాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణాకర్‌రాజు, ప్రముఖ సైకాలజిస్ట్ రమాదేవి, స్థానిక కార్పొరేటర్లు గుండేటి నరేందర్ కుమార్, ఓని భాస్కర్, గ్రెయిన్ మార్కెట్ మాజీ టీ.రమేష్‌బాబు, వివేకానంద విద్యాకేంద్ర విష్ణు, ఇండియన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ గోవిందరాజులు, ఉపాధ్యాయులు తదితరులు పాలొన్నారు.



విద్యార్థులతో ఎమ్మెల్యే, స్కూల్ యాజమాన్యం

కొనసాగుతున్న వసంతోత్సవాలు

కాజీపేట: కాజీపేటలోని శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో 25వ రజతోత్సవ వేడుకలు బుధవారం కొనసాగాయి. దేశంలోని సప్త నదుల నుంచి భక్తులు తీసుకొచ్చిన జలాలతో స్వామి వారికి దేవాలయ వ్యవస్థాపకుడు ఐనవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో పండితులు అభిషేకాలు, అర్చనలు జరిపించారు. అలాగే, లక్ష గరికపూజ, 108 కలశాలకు పూజ, సమస్ర నామార్చనలు చేశారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ – రమ దంపతులు పూజలో పాల్గొన్నారు. దేవాలయ ఆస్థాన నృత్య కళాకారిణి సీతారత్నం బృందం ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



దివ్యక్షేత్రానికి చేరుకున్న భక్తులు